ఆ ఖాతాలపై ఓ కన్నేయండి

లంచం, అవినీతి ఆనవాళ్లు దొరకొచ్చు

రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల బ్యాంక్ అకౌంట్లపై భారత్‌కు ఎఫ్‌ఏటీఎఫ్ సూచన

లోతైన పర్యవేక్షణ అవసరమని వ్యాఖ్య

దేశీయ మనీ లాండరింగ్ నిరోధక వ్యవస్థలపై త్వరలో నివేదిక విడుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 9: 'మీ దేశంలో మనీ లాండరింగ్ కార్యకలాపాలకు ఆస్కారమున్నది. బ్యాంకింగ్ లావాదేవీలపై ఓ కన్నేయండి. రాజకీయ, అధికార యంత్రాంగాల్లో భారీగా ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయనిపిస్తున్నది' అంటూ అంతర్జాతీయ యాంటీ-మనీ లాండరింగ్ వాచ్‌డాగ్.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) భారత్‌ను గట్టిగా హెచ్చరించిందని సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, వాళ్లవాళ్ల కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలపై నిఘా పెట్టాలని ఎఫ్‌ఏటీఎఫ్ మోదీ సర్కారుకు సూచించింది.

కొత్త ఖాతాలపై..

రాజకీయ నేతల ఆర్థిక వ్యవహారాలను లోతుగా పరిశీలించాలని తమ సమీక్ష సిఫార్సుల్లో భాగంగా ఎఫ్‌ఏటీఎఫ్ కేంద్రానికి సలహా ఇచ్చినట్టు ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, లంచం, అవినీతికి వీలున్నప్పుడు రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులు, వారికి సన్నిహితంగా ఉండేవారి బ్యాంక్ ఖాతాలపై నజర్ పెట్టాల్సిందేనని అంతర్జాతీయ నిబంధనలు చెప్తున్నాయని ఎఫ్‌ఏటీఎఫ్ గుర్తుచేస్తున్నది. ఆయా ఖాతాల్లో ఉన్న నిధులు ఎక్కడి నుంచి వచ్చాయన్న ఆరా తీస్తూనే.. వారు, వాళ్లకు సంబంధించిన వారు ఏమైనా కొత్త ఖాతాలను తెరిచారా? అన్న కోణంలో సీనియర్ బ్యాంక్ మేనేజర్ల నుంచి సమాచారం రాబాట్టాలని కూడా ఎఫ్‌ఏటీఎఫ్ చెప్పినట్టు తెలుస్తున్నది. మొత్తంగా బ్యాంకింగ్ లావాదేవీలపై పర్యవేక్షణను మెరుగుపర్చుకోవాల్సిన అవసరమైతే ఉన్నదని ఈ గ్లోబల్ వాచ్‌డాగ్ భారత్‌కు స్పష్టం చేసింది.

చట్టాల్లో సవరణలు?

దేశంలో ప్రస్తుతమున్న మనీ లాండరింగ్ నిరోధక చట్టాలను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే ఎఫ్‌ఏటీఎఫ్ ఇప్పుడున్న చట్టాలను, అధికారాలను, వాటిలోని లోటుపాట్లను సమీక్షిస్తున్నట్టు చెప్తున్నారు. ఈ మేరకు తుది నివేదిక వస్తే చట్టాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని కూడా సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నిజానికి గత ఏడాది డిసెంబర్‌లోనే పార్లమెంట్‌లో ఈ కొత్త చట్టాల సంకేతాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చారు. ఈ సందర్భంగా కఠిన బ్యాంకింగ్ నిబంధనలు, పరవేక్షణలోకి దేశంలోని రాజకీయ నాయకులను తీసుకురావడం తమ ఉద్దేశమేమీ కాదన్న మోదీ.. చట్టాల సవరణకు ముందు ఎఫ్‌ఏటీఎఫ్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. మరోవైపు దేశంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టాల అమలుపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న సంగతి విదితమే. అయితే మనీ లాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ కేసుల విచారణను మరింత వేగవంతం చేసేలా చట్టాలుండాలన్న వాదనలు సైతం వినిపిస్తున్నాయి.

ఏం జరుగుతోంది?

భారతీయ మనీ లాండరింగ్ నిరోధక వ్యవస్థల్ని గత ఏడాది నుంచి ఎఫ్‌ఏటీఎఫ్ సమీక్షిస్తున్నది. అయితే ఈ నేపథ్యంలో దాన్నుంచి ఈ తరహా హెచ్చరికలు రావడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఏదో పెద్ద కుంభకోణం జరిగిందా? అన్న అనుమానాలూ తలెత్తుతున్నాయి మరి. నిప్పు లేనిదే పొగ రాదన్నట్టు ఎక్కడో భారీ స్థాయిలోనే అక్రమాలను ఎఫ్‌ఏటీఎఫ్ గుర్తించి ఉంటుందని, అందుకే ఈ ముందస్తు సంకేతాలన్న గుసగుసలు ప్రస్తుతం ఆర్థిక శాఖ పెద్దల్లో నడుస్తున్నట్టూ తెలుస్తున్నది. ఇక తమ సమీక్షపై ఎఫ్‌ఏటీఎఫ్ త్వరలో భారత్‌కు నివేదిక ఇవ్వనున్నది. దీంతో ఇది వచ్చాక పెను ప్రకంపనలకు అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయిప్పుడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎఫ్‌ఏటీఎఫ్ తాజా సూచనలు హాట్ టాపిక్‌గా మారుతున్నాయి.

బ్యాంక్ ఖాతా కావాలంటే నలుగురు నామినీలుండాల్సిందే

లోక్‌సభలో బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లును శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ప్రవేశపెట్టారు. ఇకపై ఒక్కో బ్యాంక్ ఖాతాకు నలుగురు నామినీలు కావాలన్న నిబంధనను ఇందులో తీసుకువచ్చారు. ప్రస్తుతం ఒక్క నామినీతో ఖాతాల్ని తెరిచేస్తున్న విషయం తెలిసిందే. అలాగే డైరెక్టర్‌షిప్‌ల కోసం 'సబ్‌స్టాన్షియల్ ఇంట్రెస్ట్'ను పునర్నిర్వచిస్తూ దానికున్న పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచారు. సహకార బ్యాంకులకు సంబంధించీ కొన్ని మార్పులు తెస్తున్నారు. ఇక చట్టబద్ధ ఆడిటర్లకు చెల్లింపుల విషయంలో బ్యాంకులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని కూడా మోదీ సర్కారు నిర్ణయించింది. కాగా, రెగ్యులేటరీ సమ్మతి కోసం బ్యాంకుల రిపోర్టింగ్ రోజులనూ ప్రతి నెలా రెండో, నాల్గో శుక్రవారాలకు బదులుగా 15, నెలాఖరు తేదీల్లోకి మార్చుతున్నారు. ఆర్బీఐ చట్టం 1934, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, ఎస్బీఐ చట్టం 1955, బ్యాంకింగ్ సంస్థల చట్టాలు 1970, 1980ల్లో సవరణల కోసం తెచ్చిన ఈ బిల్లుకు గత శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సంగతి విదితమే. బ్యాంకుల్లో మెరుగైన పాలనాపరమైన అంశాల కోసం, మదుపరులు-ఖాతాదారుల ప్రయోజనార్థం ఈ మార్పులు తెస్తున్నట్టు ఇటీవలి బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు.

లంబోర్ఘిని నయా ఎస్‌యూవీ

ధర రూ.4.57 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఇటలీకి చెందిన సూపర్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆటోమోబిలి లంబోర్ఘిని..దేశీయ మార్కెట్లోకి మరో ప్లగ్-ఇన్ హైబ్రిడ్ వెర్షన్ ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ ఊరస్ ఎస్‌ఈ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర రూ.4.57 కోట్లు(న్యూఢిల్లీ షోరూంలో). ఈ ఏడాది తొలినాళ్లలో అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన రెండో హైబ్రిడ్ కారును ప్రస్తుతం దేశీయంగా విడుదలచేసింది సంస్థ. ట్విన్ టర్బో 4.0 లీటర్ వీ8 ఇంజిన్‌తో తయారైన ఈ కారులో 25.9 కిలోవాట్ల లిథియం అయాన్ బ్యాటరీతో తయారు చేసింది. సింగిల్ చార్జింగ్‌తో కేవలం 60 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 3.4 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 312 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దేశవ్యాప్తంగా హైబ్రిడ్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా మాడల్‌ను విడుదల చేసినట్లు ఆటోమోబిలి లంబోర్ఘిని ఆసియా పసిఫిక్ రీజియన్ డైరెక్టర్ ఫ్రాన్స్‌స్కో స్కార్డోని తెలిపారు. 2023లో సంస్థ 103 యూనిట్లను విక్రయించింది.

కెనరా బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బెస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్‌ఆర్)ని 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు అధికంకానున్నాయి. అత్యధిక మంది తీసుకునే ఏడాది కాలపరిమితితో వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9 శాతానికి సవరించింది. అలాగే మూడేండ్ల రుణాలపై రేటును 9.40 శాతానికి పెంచిన బ్యాంక్.. రెండేండ్ల రుణాలపై వడ్డీరేటును 9.30 శాతానికి పెంచింది. వీటితోపాటు నెల, మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటు 8.35 శాతం నుంచి 8.80 శాతం మధ్యలో ఉంచింది. పెంచిన వడ్డీరేట్లు ఈ నెల 12 నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది.

బీవోబీ కూడా...

బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) కూడా తన ఎంసీఎల్‌ఆర్ రేటును ఐదు బేసిస్ పాయింట్లు సవరించింది. ఈ నెల 12 నుంచి అమలులోకి వచ్చేలా ఎంపిక చేసిన కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ని పెంచింది. ఒక్క రోజు, నెల రుణాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన బ్యాంక్..మూడు, ఆరు నెలల, ఏడాది కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్‌ఆర్‌ని పెంచింది. దీంతో ఏడాది రుణాలపై ఎంసీఎల్‌ఆర్ రేటు 8.90 శాతం నుంచి 8.95 శాతానికి చేరుకున్నది. అలాగే యూకో బ్యాంక్ కూడా ఈ నెల నుంచి అమలులోకి వచ్చేలా ఎంసీఎల్‌ఆర్‌ని పెంచింది. దీంతో రోజు, నెల, మూడు, ఆరు నెలలు, ఏడాది రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 8.95 శాతం మధ్యలో వసూలు చేస్తున్నది.

భగ్గుమన్న పసిడి

వెయ్యి రూపాయల వరకు పెరిగిన ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 9: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ ప్రియమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ తోపాటు దేశీయంగా పండుగ సీజన్ కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఫలితంగా దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం ధర రూ.1,100 ఎగబాకి రూ.72,450 పలికింది. పెరగముందు ధర రూ.71,350గా ఉన్నది. పసిడితోపాటు వెండి భారీగా పెరిగింది. కిలో వెండి ఏకంగా రూ.1,400 అధికమై రూ.82,500కి చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం పుత్తడి ధర రూ.820 అధికమై రూ.70,090కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.750 ఎగబాకి రూ.64,250కి చేరుకున్నది. రూ.1,800 అధికమైన కిలో వెండి రూ.88 వేలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 5.60 డాలర్లు పెరిగి 2,468.90 డాలర్లకు చేరుకోగా, వెండి 27.60 డాలర్ల వద్ద ఉన్నది.

తిరిగి కోలుకున్న సూచీలు

సెన్సెక్స్ 820, నిఫ్టీ 250 పాయింట్ల లాభం

ముంబై, ఆగస్టు 9: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకుపైగా లాభపడిన సెన్సెక్స్ 819.69 పాయింట్లు ఎగబాకి 79,705.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 250.50 పాయింట్లు అందుకొని 24,367.50 వద్ద స్థిరపడింది.

4.46 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడటంతో మదుపరుల పంట పండింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,46,308.99 కోట్లు పెరిగి రూ.4,50,21,816.11 కోట్ల(5.37 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. స్టాక్ మార్కెట్ లిస్టింగ్ రోజే ఓలా షేరు అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. రూ.75.99 వద్ద ప్రవేశించిన కంపెనీ షేరు ధర 19.97 శాతం లాభంతో రూ.91.18 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.40,217.95 కోట్లుగా నమోదైంది.

2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,054 కోట్ల విలువైన డివిడెండ్ చెక్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఏ మణిమేఖలై.

హైదరాబాద్‌లో అమెజాన్ హబ్స్

ముంబై, ఆగస్టు 9: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా..దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో హబ్స్‌లను ఏర్పాటు చేసింది. అత్యవసర సహాయ సామాగ్రిని అందించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌తో పాటు థానే, ఫరీదాబాద్, పూర్బ బర్ధమాన్‌లో ఈ కేంద్రాలను నెలకొల్పింది. వర్షాల కారణంగా దేశంలో అనేక ప్రాంతాలలో వరదలు సంబంధించి ప్రజలకు 72 గంటల్లోగా అత్యవసర సహాయ సామగ్రిని అందించాలనే ఉద్దేశంతో నాలుగు దిక్కుల్లో నాలుగు విపత్తు కేంద్రాలను నెలకొల్పింది.

ఎన్టీఆర్-నీల్ యాక్షన్ డ్రామా షురూ

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్, కేజీఎఫ్ ఫేమ్ దర్శకుడు ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న పాన్ ఇండియా యాక్షన్ మూవీ శుక్రవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. మే నెలలోనే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. అప్పటి నుంచి ఈ సినిమా లాంచ్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయని, వాటన్నింటిని అందుకునేలా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నామని, ఎన్టీఆర్ పాత్ర పవర్‌పుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: భువన్‌గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైన్: చలపతి, నిర్మాతలు: నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, రచన-దర్శకత్వం: ప్రశాంత్‌నీల్.

భాగ్యనగరిలో అజిత్ యాక్షన్

తమిళ అగ్ర హీరో అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. తాజా షెడ్యూల్‌లో అజిత్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అజిత్ పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నాం. పోరాట ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం మరో ఆకర్షణ. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందు కుతీసుకొస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభినందన్ రామానుజం, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: అధిక్ రవిచంద్రన్.

కీరవాణి సంగీతం చంద్రబోస్ సాహిత్యం

హరికృష్ణ మనవడు, దివంగత జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ సీనియర్ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రస్టింగ్ అప్‌డేట్స్‌ను ప్రకటించారు. తెలుగమ్మాయి వీణ రావు హీరోయిన్‌గా నటించనుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం, చంద్రబోస్ సాహిత్యాన్ని అందించబోతున్నారు. సాయిమాధవ్ బుర్రా సంభాషణల రచయిత. ఈ సందర్భంగా దర్శకుడు వైవీఎస్ చౌదరి మట్లాడుతూ 'కీరవాణిగారు యుగపురుషుడు లాంటి వారు. ఆయన నాకు మర్చిపోలేని పాటలు అందించారు. అలాంటి గొప్ప వ్యక్తితో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. చంద్రబోస్ సాహిత్యం అద్భుతంగా ఉండబోతున్నది. సాయిమాధవ్ బుర్రా ప్రతి సినిమాకు గొప్పగా ఎదిగారు. ఆయన మా చిత్రానికి మాటలు రాయడం ఆనందంగా ఉంది. మంచి కూచిపూడి డ్యాన్సర్ అయిన తెలుగమ్మాయి వీణ రావుని కథానాయికగా పరిచయం చేస్తున్నాం' అన్నారు. కీరవాణి, చంద్రబోస్, వైవీఎస్ చౌదరి వంటి గొప్ప వ్యక్తులతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని సాయిమాధవ్ బుర్రా పేర్కొన్నారు.

చిత్రం

సింగిల్ అని ఎప్పుడైనా చెప్పానా?

సాధారణంగా కథానాయికలు తమ రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి బహిరంగంగా చెప్పడానికి అంతగా ఇష్టపడరు. ఏదైనా ఇంటర్వ్యూలో అలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు సాధ్యమైనంత వరకు దాటవేసే ప్రయత్నం చేస్తారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అగ్ర కథానాయిక కీర్తి సురేష్ తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి పరోక్షంగా తన మనసులోని మాటను బయటపెట్టింది. 'ఇన్నేళ్లు సింగిల్‌గా ఉంటున్నారు. మీకస్సలు బోర్‌గా అనిపించడం లేదా? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు..'నేను సింగిల్‌గా ఉన్నానని మీతో ఎప్పుడైనా చెప్పానా? అంటూ ఎదురు ప్రశ్నించింది. దాంతో ఈ భామ ప్రేమలో ఉందనే నిర్ధారణకు వచ్చారు అభిమానులు. అదే విషయాన్ని పరోక్షంగా చెప్పిందని అనుకుంటున్నారు. కీర్తి సురేష్ వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ముద్దుగుమ్మ మనసు దోచిన కుర్రాడెవరంటూ ఆమె అభిమానులు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఇదే ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి కూడా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది కీర్తి సురేష్. కెరీర్ ఆరంభంలో వరుస ఫెయిల్యూర్స్‌తో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, 'మహానటి' చిత్రం తర్వాతే అద్భుతమైన విజయాలు వరించాయని చెప్పింది. కీర్తి సురేష్ తాజా తమిళ చిత్రం 'రఘు తాత' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది.

అగ్ర హీరో బాలకృష్ణ ఈ ఏడాదితో 50 ఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించేందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమ భారీగా సన్నాహాలు చేస్తున్నది. సెప్టెంబర్ 1న స్వర్ణోత్సవ వేడుకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కట్టెన్ రైజర్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. బాలకృష్ణ సోదరులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ స్వర్ణోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'తల్లి మనసు' ప్రారంభం

సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు అనంత కిషోర్ నిర్మాతగా రూపొందిస్తున్న తొలిచిత్రం 'తల్లి మనసు' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రచిత మహాలక్ష్మి, కమల్‌కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత పోకూరి బాబురావు క్లాప్‌నివ్వగా, ఏషియన్‌గ్రూప్ భరత్ నారంగ్ కెమెరా స్విఛాన్ చేశారు. టైటిల్‌ను బట్టి ఎంత మంచి సబ్జెక్ట్‌తో సినిమా చేస్తున్నామో అర్థం చేసుకోవచ్చని, తల్లి పాత్రలో రచిత నటిస్తున్నారని ముత్యాల సుబ్బయ్య తెలిపారు. మధ్యతరగతి తల్లి మనోవేదన, సంఘర్షణకు దృశ్యరూపంగా ఉంటుందని దర్శకుడు వి.శ్రీనివాస్ పేర్కొన్నారు. యాభై రోజుల పాటు జరిగే సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: నివాస్, సంగీతం: కోటి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.శ్రీనివాస్.

1980నాటి ప్రేమకథ

ఎస్.ఎస్.సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '1980లో రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకుడు. ఎస్‌వీ క్రియేషన్స్ పతాకంపై ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. తెలుగు మరియు బంజారా భాషల్లో విడుదలకానుంది. శుక్రవారం నిర్మాతలు బెక్కం వేణుగోపాల్, రామ్ తాళ్లూరి, హీరో సోహైల్ చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ '1980ల నాటి ప్రేమకథ ఇది. అప్పటి రోజులను కళ్లముందుంచుతూ హృద్యంగా సాగుతుంది. కథానుగుణంగా పాటలకు మంచి ప్రాధాన్యత ఉంది' అన్నారు. ఈ చిత్రానికి ఎం.ఎల్.రాజా సంగీతాన్నందించారు.

కాలం రాసిన కథలు

ఎం.ఎన్.వి.సాగర్, శృతిశంకర్, వికాస్, విహారిక చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎం.ఎన్.వి.సాగర్ దర్శకనిర్మాత. ఈ నెల 29న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల యువ హీరో ఆకాష్ జగన్నాథ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ఎం.ఎన్.వి. సాగర్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ ఇది. పునర్జన్మ నేపథ్యంలో పరువు హత్యల కథాంశంతో తెరకెక్కించాం. ఐదు జంటల మధ్య కథ నడుస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మేరుగు అరమాన్, రచన, నిర్మాత, దర్శకుడు: ఎం.ఎన్.వి.సాగర్.

నేషనల్ క్రష్ అంటున్నారు

'మిస్టర్ బచ్చన్' చిత్రం ద్వారా తెలుగు సినీరంగంలోకి అరంగేట్రం చేస్తున్నది మరాఠీ సుందరి భాగ్యశ్రీ బోర్సే. తొలి సినిమాకే తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పడం గొప్ప అనుభూతినిచ్చిందని, తెలుగు బ్యూటీపుల్ లాంగ్వేజ్ అంటూ కొనియాడింది. రవితేజ హీరోగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం భాగ్యశ్రీ బోర్సే పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న సంగతులు...

- నా స్వస్థలం మహారాష్ట్రలోని ఔరంగాబాద్. మా నాన్న ఉద్యోగరీత్యా నైజీరియాకు వెళ్లడంతో అక్కడే నా పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. గ్రాడ్యుయేషన్ కోసం ముంబయికి వచ్చిన సమయంలో మోడలింగ్ రంగంలో అవకాశాలొచ్చాయి. 'చందూ ఛాంపియన్' చిత్రంలో చిన్న రోల్ ద్వారా బాలీవుడ్‌కు పరిచయమయ్యా.
- 'మిస్టర్ బచ్చన్' సినిమా కోసం హైదరాబాద్‌కు వచ్చి ఆడిషన్స్‌లో పాల్గొన్నా. నా యాక్టింగ్ నచ్చడంతో సెలెక్ట్ చేశారు. ఈ సినిమాలో నేను తెలుగు మార్వాడి అమ్మాయి జిక్కీగా కనిపిస్తా. ఎప్పుడూ చలాకీగా ఉండే పాత్ర నాది. బచ్చన్ జీవితంలో జిక్కీ ఎలాంటి రోల్‌ప్లే చేసిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది.
- నా పాత్రకు తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పాను. అదొక గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. నేను నార్త్ ఇండియా అమ్మాయిని కాబట్టి తెలుగు అర్థం చేసుకోవడం తొలుత కొంచెం కష్టంగా అనిపించింది. క్రమంగా భాషపై పట్టు సాధించా. తెలుగు భాష చాలా అందంగా, అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం పూర్తిగా నేర్చుకునే ప్రయత్నంలో ఉన్నా.
- ఈ సినిమా విషయంలో రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ ఎంతగానో సహకరించారు. వారి ఎంకరేజ్‌మెంట్ వల్లే నా క్యారెక్టర్‌లో రాణించాను. సోషల్‌మీడియాలో చాలా మంది నన్ను నేషనల్ క్రష్ అంటూ పొగుడుతున్నారు. అదొక బిగ్గెస్ట్ కాంప్లిమెంట్‌గా తీసుకుంటాను (నవ్వుతూ).